

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కర్నూలు నంద్యాల

గురువారం | 17 జూలై 2025

పేజీలు 8


## సీఎం చంద్రబాబు పర్యటనకు

# ముమ్మరంగా ఏర్పాట్లు

- అల్లూరులో హెలిప్యాడ్ ఏర్పాటు
- రైతులతో ముఖాముఖిలో పాల్గొననున్న సీఎం చంద్రబాబు
- ఏర్పాట్లు పరిశీలించిన నంద్యాల కలెక్టర్ ,నంద్యాల ఎస్పీ
- పోలీసులతో భారీ బందోబస్తు- నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా
- హెలికాప్టర్ తో ట్రయల్ రన్ పరిశీలించిన నంద్యాల కలెక్టర్ ,నంద్యాల ఎస్పీ

**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మల్యాలపర్యటన సందర్భంగా చేపడుతున్న ఏర్పాట్లను నంద్యాల జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇంచార్జి మాండ్ర శివానంద రెడ్డి లు బుధ వారం పరిశీలించారు. అల్లూరు గ్రామంలో హెలికాప్టర్ ల్యాండింగ్ ప్రదేశాన్ని పరిశీలిం చారు. హెలిప్యాడ్ ప్రదేశంలో తీసుకుంటున్న భద్రత చర్యలపై ఎస్పీని అడిగి తెలుసు కున్నారు.మల్యాల క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్న రైతులతో ముఖాముఖీ కోసం ఏర్పాటు చేస్తున్న సభా ఏర్పాట్లను పరిశీలిం చారు.అనంతరం పంపు హౌస్ దగ్గర జలహారతి, నీటివిడుదల పంపు మోటార్ల ను పరిశీలించారు.ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందిని ఎస్పీ ఆదే శించారు.హెలికాప్టర్ ల్యాడింగ్ ప్రదేశాన్ని డాగ్ స్కాడ్ తో

మిగతా 2లో



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నంద్యాల జిల్లా కలెక్టర్,ఎస్పీ,జేసీ,ఎమ్మెల్యే,అధికారులు

## కరవు సీమకు

# కల్పతరువు మల్యాల



కృష్ణా జలాల తరలింపు దృశ్యం

- ఆసియాలో అతి పెద్ద ఎత్తిపోతుల పథకం
- రాయలసీమ జిల్లాలకు కృష్ణా జిల్లా తరలింపు
- సీమ జిల్లాల్లో జలసిరులు
- పూర్తి అయిన ఫేజ్-1 పనులు
- నెలాఖరుకు ఫేజ్-2 పూర్తి చేయాలని లక్ష్యం
- రూ.3890 కోట్లతో మల్యాల పథకం
- నేడు నీటిని విడుదల చేయనున్న ముఖ్యమంత్రి

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** ఒకప్పుడు రాయలసీమ రతనాల సీమ గా పేరొందింది. సీమ జిల్లాలైన ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూ రు జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల తోపాటు ఇరిగేషన్ ప్రాజెక్టులపై గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో రాయలసీమ కరవు సీమగా మారింది. కొన్నేళ్ళు నాలుగు జిల్లాల్లో కరవు విళయతాండ వం చేసింది. దివంగత ఎన్‌టి రామా రావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేప ట్టిన తర్వాత సీమ జిల్లాల్లో ప్రాజెక్టులపై దృష్టి పెట్టారు. అందులో భాగంగానే తెలుగుగంగను

మిగతా 2లో



మల్యాల ఎత్తిపోతల పథకం

# నగరానికి 'న్యూ లుక్' తేవాలి



2లో

మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

## పుర మిత్ర యాప్ ద్వారా

# సమస్యలు తెలియజేయండి

**కర్నూలు,మేజర్ న్యూస్ బ్యూరో :** కర్నూలు నగర ప్రజలు తమ సమస్యలను తెలిపేందుకు పుర మిత్ర యాప్‌ను ఉపయో గించుకోవాలని రాష్ట్ర పరిశ్ర మలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ కోరారు. పుర మిత్ర యాప్ ద్వారా సమస్యలను ఫోటో తీసి పోస్ట్ చేయాలని.. తద్వారా అధికారులు స్పందిం చి వెంటనే

మిగతా 2లో



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్




# కరవు సీమకు కల్పతరువు మల్యాల

(మొదటి పేజి తరువాయి)

ఏర్పాటు చేసి తమిళనాడుకు త్రాగునీటి అవసరాలను తీర్చారు. 1989వ సంవత్సరంలో ఎన్‌టిఆర్ హాయాంలో అప్పటి కర్నూలు జిల్లాలోని హంద్రి, చిత్తూరు జిల్లాలోని నీవాలను కలుపుతూ నందికొట్కూరు నియోజకవర్గం మల్యాల వద్ద హంద్రినివా పేరుతో ఎత్తిపోతల పథకం పురుడు పోసుకుంది. ఆసియాలోనే అతి పెద్ద ఎత్తిపోతల పథకంగా అవతరించింది. ప్రధానంగా రాయలసీమ జిల్లాలకు కృష్ణా జలాలను తరలించడమే లక్ష్యంగా ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారు. మల్యాల ఎత్తిపోతల పథకంలో ఫేజ్-1, మరియు ఫేజ్ -2 క్రింద పనులు చేపట్టారు. 2006లో ఫేజ్ -1 పనులు ప్రారంభమయ్యాయి. జులై ఆఖరు నాటికి ఫేజ్ -2 పనులు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని యుద్ధ ప్రాతిపదికన పనులు పరుగులు పెడుతున్నాయి. రెండు ఫేజ్‌లు పూర్తయితే చిత్తూరు జిల్లాలోని పుంగనూరు, కూప్పం బ్రాంచ్ కెనాల్ వరకు సాగునీటిని అందిస్తుంది. రూ. 3,890 కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకం మరికొద్ది రోజుల్లో పూర్తి కానుంది. కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో 30 లక్షల మందికి దాహార్తిని తీర్చడంతోపాటు ఆయకట్టుకు సాగునీరును అందిస్తుంది. మల్యాల నుంచి జీడిపల్లె వరకు 216 కిలో మీటర్ల పొడవున హంద్రినివా కాల్వ పనులు చేపట్టారు. ఇందు కోసం రూ. 696 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఫేజ్-1 పూర్తి కావడంతో నంద్యాల జిల్లాలో 2,906, కర్నూలు జిల్లాలో 77,094, అనంతపురం జిల్లాలో 1,18,000 ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. ఫేజ్-2 పూర్తయితే అనంతపురం జిల్లాలో 2.27 లక్షలు, కడప జిల్లాలో 37 వేలు, చిత్తూరు జిల్లాలో 1.40 లక్షల ఎకరాలకు సాగునీరును అందిస్తుంది. మల్యాల ఎత్తిపోతల పథకంతో భూ గర్భజలాలు పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తుంది. ఫేజ్-1 క్రింద 2200 క్యూసెక్కులు, ఫేజ్ -2 క్రింద 1600 క్యూసెక్కులు అదనంగా కృష్ణా జలాలను తరలించే అవకాశం ఉంటుంది. ప్రాజెక్టు సామర్థ్యం 40 వేల టిఎంసిలు కాగా, గత ప్రభుత్వం ప్రాజెక్టుపై నిర్లక్ష్యం చేయడంతో సామర్థ్యం మేరకు నీటిని తరలించలేకపోయారు. ఇప్పటి వరకు ఒకటి, రెండు సార్లు మాత్రమే వరద సమయంలో పూర్తి సామర్థ్యంలో నీటి తరలింపు సాధ్యమైంది. ప్రస్తుతం కాల్వల సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెరగడంతో పూర్తి సామర్థ్యంతో వరద జలాలను సీమ జిల్లాలకు వినియోగించే అవకాశం కనిపిస్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హంద్రినివా విస్తరణ పనులను పూర్తి చేయాలని నిర్ణయించింది. వంద రోజుల ప్రణాళికతో ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టించింది. ప్రతి నెల 4.24 టిఎంసిల చొప్పున 4 నెలల వరద సమయంలో అదనంగా 17.10 టిఎంసిల నీటిని తీసుకునేందుకు అవకాశం కలగనుంది. మల్యాల ఎత్తిపోతల పథకంతో 6 లక్షల పై చిలుకు ఎకరాలకు సాగునీరు అందనుంది. 2014వ సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వం రూ. 4.317 కోట్లకు పాలన అనుమతులను ఇచ్చింది. ఐదేళ్ళ కాలంలో 47 శాతం మేరకు పనులను పూర్తి చేసింది. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వ హాయాంలో పనులు అనుకున్న మేరకు ముందుకు సాగలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక పనుల్లో కదలిక స్పష్టంగా కనిపించింది. 2025వ సంవత్సరం ఏప్రిల్‌లో మొదలైన విస్తరణ పనులు కేవలం వంద రోజుల్లో పూర్తయ్యాయి. ఫేజ్-2 పనులు నెలాఖరుకు పూర్తి అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫేజ్-1 క్రింద 10 చోట్ల ఎత్తిపోతల పథకం క్రింద నీటిని ఎత్తి పోయనున్నారు. జీడిపల్లె, కృష్ణగిరి, పత్తికొండ, గాజులదిన్నె చెరువులు కళకళలాడనున్నాయి. వీటితోపాటు స్థానికంగా సీమ జిల్లాల్లోని చెరువులను నీటితో నింపనున్నారు.

# సీఎం చంద్రబాబు పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు

(మొదటి పేజి తరువాయి)


సమావేశంలో మాట్లాడుతున్న నంద్యాల జిల్లా ఎస్పీ


హాజరైన పోలీసులు

తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు, ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, డిఎస్పీ రామాంజి నాయక్, హంద్రీ నీవా కర్నూలు ఎస్ ఈ పాండు రంగయ్య, ఈ ఈ ప్రసాద్ రావులు ఉన్నారు.

**హెలికాప్టర్ తో ట్రయల్ రన్.. :** సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో అధికారులు హెలికాప్టర్‌తో ట్రయల్ రన్ నిర్వహించారు. ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి బయలుదేరిన హెలికాప్టర్ అల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన హెలి ప్యాడ్ పై సురక్షితంగా ల్యాండ్ అయింది.

**బందోబస్తుకు భారీగా పోలీసులు..నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా :** సీఎం మల్యాల పర్యటన సందర్భంగా అడిషనల్ ఎస్పీలు 2, డీఎస్పీలు 7, ఇన్స్పెక్టర్లు 37, సబ్ ఇన్స్పెక్టర్లు 52,ఏఎస్సై,హెడ్ కానిస్టేబుళ్ళు 177, కానిస్టేబుళ్ళు 308, మహిళా పోలీసులు 49, హోంగార్డ్స్ 84 మందితో పాటు సాయుధ బలగాలు 105 మంది, బాంబు స్క్వాడ్ , డాగ్ స్క్వాడ్ బృందాలు మరియు 06 స్పెషల్ పార్టీ బృందాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు.

## పోస్టల్ కెవీపీ బాండ్లు పోయినవి
**(POSTAL KVP BANDS)**

ఎం. న్యామతున్నిసా W/O ఎం.అబ్దుల్ కరీం, ఆత్మకూరు ఆత్మకూరు(కే) నుంచి కర్నూలు వెళ్ళేటప్పుడు ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్‌లో పోస్టల్ బాండ్లు పోయినవి. బాండ్లు నెంబర్లు **BC 423112, OOBC 4213113, BC 423114, BC 423115** ఎవరికైనా దొరికినచో దయచేసి కింది ఫోన్ నెంబర్‌కు తెలుపగలరు.

సెల్ నెం : **7995220124.**

# ఇద్దరు యువకులపై దాడి

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** పట్టణంలోని చిగురుమానుపేటలోఇద్దరుయువకులపైదాడి చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన సంపత్, లోకేష్ అనే ఇద్దరు యువకులపై చిగురుమానుపేటకు చెందిన కొంత మంది విచక్షణారహితంగా దాడి చేయ డంతో వారికి తీవ్రగాయాలైయ్యాయి. మెరుగైన చికిత్స కోసంకర్నూలుకుతరలించారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ పోలీసులుతెలిపారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# తుగ్గలి పగిడి రాయిలో భారీ వర్షం

**పరిశీలించిన తహాశీల్దార్ రవి, జొన్నగిరి ఎస్సై మల్లికార్జున**

**తుగ్గలి,మేజర్ న్యూస్ :**మండలం పరిధిలోని తుగ్గలి జొన్నగిరి, పగిడిరాయి,గిరిగేట్ల, అమీనాబాద్ గ్రామాలలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది .దీంతో పగిడిరాయి పాఠశాల వద్ద ఉండే బ్రిడ్జిపై వరద నీరు ఉధృతంగా పారడడంతో కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు అక్కడికి వచ్చి ప్రజలను అప్రమత్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసిల్దార్ రవి, డిప్యూటీ తహసిల్దార్ సుదర్శనం హుటాహుటిన అక్కడికి చేరుకుని ఉధృత ప్రాంతాన్ని పరిశీలించారు. అదేవిధంగా ఎస్సై మల్లికార్జున అక్కడికి చేరుకుని రాకపోకలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మల్లికార్జున మాట్లాడుతూ ఆకస్మికంగా ఇంత పెద్ద వర్షం రావడంతో కొద్దిసేపు వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు. దీంతో తాము ప్రజలను అప్రమత్తం చేశామని తెలిపారు.





# నగరానికి 'న్యూ లుక్' తేవాలి

**:- మున్సిపల్ అధికారుల సమీక్షలో మంత్రి టీజీ భరత్**
**:- ఆగస్టు ఆఖరు నాటికి పార్కులను తీర్చిదిద్దాలి**
**:- రహదారులపై ఎక్కడా గుంతలు కనిపించకూడదు**
**:- ప్రగతి పనులు పూర్తి చేయడంలో జాప్యం తగదు**
**:- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్**

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్ది న్యూలుక్ తేవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ అతిథిగృహంలో మున్సిపల్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. నూతన కమీషనర్ పి విశ్వనాథ్‌పై ఉన్నతాధికారుల్లో మంచి అభిప్రాయం ఉందని, పనితీరు బాగుంటుందని మంత్రి కితాబిచ్చారు. విశాఖపట్నం తరహాలో నగరాన్ని తీర్చిదిద్దేందుకు కలిసికట్టుగా పనిచేయాలని మంత్రి సూచించారు. తమ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలం పూర్తయిందని, ఇక మిగిలిన మూడున్నరేళ్లలో అభివృద్ధి పనులను పూర్తి చేయడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ కాలయాపన చేయొద్దని స్పష్టం చేశారు. పనులకు భూమిపూజ చేసిన తర్వాత నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల పురోగతిపై మంత్రి ఆరా తీశారు. పనులను చేపట్టకుండా జాప్యం చేస్తున్న గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజ్‌విహార్ సమీపంలోని ఎల్లమ్మగుడి నుండి జమ్మిచెట్టు వరకు హంద్రీ నది ఒడ్డున నిర్మిస్తున్న రహదారి పనులను వేగవంతం చేయాలని, బండ్ మరింత పటిష్టంగా ఉండేందుకు జలవనరుల శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ రుసుముల నుండి బకాయిల వసూళ్లకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని పేర్కొన్నారు. శిథిలావస్థకు చేరిన నీటి ట్యాంకుల నాణ్యత సామర్థ్యాన్ని పరిశీలించాలని సూచించారు. పార్కుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని, ఆగస్టు ఆఖరు నాటికి పార్కుల్లో మరమత్తులు పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారులపై ఎక్కడా గుంతలు కనబడకుండా ఎప్పటికప్పుడు పూడ్చుడానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. డిసెంబరు నాటికి 30వేల మొక్కలు నాటడమే కాకుండ వాటి సంరక్షణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కమ్యూనిటీ హాల్స్‌లలో ఉన్న సచివాలయాలను ఖాళీ చేసి, వాటిపైకి తరలించడం లేదా మరోచోటికి మార్చే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారుల విస్తరణ పనులు జాప్యం చేయొద్దని, స్థలం కోల్పోయే బాధితులతో త్వరితగతిన మాట్లాడి నష్టపరిహారం అందించాలని, త్వరగా విస్తరణ పనులను చేపట్టాలన్నారు. వెండర్ జోన్లను ఆలస్యం చేయకుండ త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్న రాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఓ జునైద్, ఇంచార్జ్ ఎస్ఈ శేషసాయి, ఎంఈ లీల ప్రసాద్, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య, సూపరింటెండెంట్లు సుబ్బన్న, స్వర్ణలత, మంజూర్ బాష, కార్పొరేటర్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పుర మిత్ర యాప్ ద్వారా సమస్యలు తెలియజేయండి..

(మొదటి పేజి తరువాయి)

పరిష్కరిస్తారని చెప్పారు. వార్డుల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా యాప్ లో ఉన్న విధంగా వివరాలు నమోదు చేయాలని సూచించారు. పురపాలక శాఖ పురమిత్ర యాప్ ను ప్రజలందరికీ అందుబాటులోకి తెచ్చిందనీ, ఈ యాప్ డౌన్ లోడ్ చేసుకుని స్మార్ట్ ఫోన్‌తో అక్కడి సమస్య తీవ్రత తెలిసేలా ఫొటోలు తీసి అప్లోడ్ చేస్తే సిబ్బంది 24 గంటల వ్యవధిలో సమస్యను పరిశీలించేందుకు వస్తారన్నారు. తర్వాత పరిష్కరించేందుకు కృషి చేస్తారని చెప్పారు. ప్రజలు సమస్యను తెలిపేందుకు అధికారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని.. పారిశుద్ధ్యం, నీటి సరఫరా, వీధిదీపాలు, ఇతర సమస్యలను ఈ యాప్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చన్నారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి టీజీ భరత్ తెలిపారు.

# సింగల్ విండో అధ్యక్షులు, మెంబర్ల పదవీ బాధ్యతల స్వీకరణ



**గడివేముల మేజర్ న్యూస్ :** గడివేముల మండల కేంద్రమైన గడివేములలో ప్రాథమిక సహకార పరిమితి సహకార సంఘం సొసైటీ అధ్యక్షులుగా దేశం సత్యనారాయణ రెడ్డి మరియు మెంబర్లుగా శివారెడ్డి, యుగదర్ రెడ్డిలు బుధవారం నాడు పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈవో ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తరువుల మేరకు పదవి బాధ్యతలు స్వీకరించారని సొసైటీ సీఈవో ఆదినారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# నమస్తే పథకంతో పారిశుద్ధ్య కార్మికులకు మంచి గుర్తింపు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నమస్తే పథకం (నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజేడ్ శానిటేషన్ ఎకోసిస్టమ్) ద్వార పారిశుద్ధ్యకార్మికులకు మంచి గుర్తింపు లబిస్తుందని ఎం పీడీవో మణిమంజరి, ఈవోఆర్డి ఆనంతశయన, కార్యదర్శి సతీశ్, గ్రామ సర్పంచ్ హైమావతి అన్నారు. ఈ పథకం కింద బుధవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో పారిశుద్ధ్యపనులలో పని చేస్తున్న కార్మికులను గుర్తించి పూల మాలలతో అధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నమస్తే పథకం ద్వార పారిశుద్ధ్య కార్మికులకు వృత్తిపరమైన గుర్తింపు కార్డులు, పీపీఈ కిట్లు, సామాజిక భద్రత, ఆర్థిక చేరిక, ఆరోగ్యప్రయోజనాలు, మరియూ నైపుణ్యత, పట్ల వీరి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందాన్నరు. వారికి సాధికారత కల్పించాలని ప్రభుత్వం ఈ పథకంను ప్రవేశ పెట్టందనివారు వివరించారు. ఈ కార్యక్రమంలో మలాంగ్, సుభాన్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్పాదన సేవా రంగాల్లోని యూనిట్లకు లక్షల విలువైన రాయితీ



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఉత్పాదన, సేవా రంగాల్లోని 25యూనిట్లకు మొత్తం 96.08 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాలను మంజూరు చేయడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కొరకు పెట్టుబడి రాయితీ, పావ లావడ్డీ, విద్యుత్, సేల్స్‌టాక్స్ తదితర రాయితీల కింద జిల్లాలో ఉత్పాదన, సేవా రంగాల్లోని 25యూనిట్లకు మొత్తం 96.08 లక్షలు విలువైన రాయితీ ప్రయోజనాలు మంజూరు చేయడం జరిగింద న్నారు. గత త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోసం 116 దరఖాస్తులు అందగా సింగిల్ డెస్క్ విధనం లో ఆయా శాఖల ద్వారా 94పరిశ్రమలకు అనుమతులు మంజూరయ్యాయని వాటిలో 22 దరఖాస్తులు పరి శీలనలో ఉన్నాయన్నారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని డీఆర్వో అధికారు లను ఆదేశించారు. పిఎం విశ్వకర్మ పథకం కింద నమో దైన దరఖాస్తులను పరిశీలించి స్టేజి-3కి పంపడం జరిగిందన్నారు. ఒక జిల్లా ఒక ఉత్పత్తిలో భాగంగా జిల్లా లో ఎక్కువ ప్రాముఖ్యత ఉన్న వాటిని పెద్ద ఎత్తున ప్రోత్స హించేలా చర్యలు తీసుకోవాల న్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం మహబూ బ్‌బాషా, పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, ఎల్డీఎం రవీందర్‌కుమార్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ కిషోర్‌రెడ్డి, ఎస్సీ ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ అద్యక్షులు రాజమహేంద్రనాథ్, నంది డైయిరీ మేనేజింగ్ డైరెక్టర్ కల్లూరి రామలిం గారెడ్డిలు పాల్గొన్నారు.

**పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తప్పనిసరి :**

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుని వాటి నివారణకు తగు చర్యలు తీసుకోవాలని డీఆర్వో రామునాయక్ అధికారులను ఆదేశించారు. పరిశ్రమల యాజమాన్యాలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. అందుకు ముందుగా జిల్లా ఆఫ్ సైట్ ఎమర్జెన్సీ ప్లాన్‌ను సిద్ధంగా ఉంచుకోవాలన్నా రు. అదే విధంగా పరిశ్రమల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించిన ప్పుడు సంబంధిత అధికారులను అందరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్‌రెడ్డి, జిల్లా విపత్తు నిర్వహ ణ, అగ్నిమాపకశాఖ, ఎస్డీఆర్‌ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



రికార్డులను తనికీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మంత్రాలయం మండల పరిధిలో ఉన్న ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను సీటిటిమ్ ఒంగోలు, ఏడిఏ రమేష్ బాబు, కడప సిఐ నారాయణప్ప, ఎమ్మిగనూరు ఏడిఏ మహమ్మద్ ఖాద్రి, మంత్రాలయం మండల వ్యసాయ అధికారి జీరా గణేష్‌లు తనిఖీ చేపట్టారు. మాధవరంలోని శ్రీ పాండురంగ ట్రేడర్స్‌లో సక్రమంగా ఎరువులకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో 8 లక్షల 92వేలు విలువగల 33మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. అనంతరం సీట్‌టీమ్ ఆదేశాల మేరకు 6 రకాల ఎరువుల నమూనాలను 3 రకాల పురుగు మందులు నమూనాలను వాటి యొక్క నాణ్యత కొరకు పరిశోధన కేంద్రానికి పంపినట్లు తెలిపారు. ఎరువుల పురుగుల మందుల రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లు ఇవ్వాలని దుకాణాదారులను ఆదేశించారు.

# బ్రాహ్మణ కార్పోరేషన్‌కు నిధులు కేటాయించండి

**- యన్ వెంకటరామరాజు**



టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు టిడి జనార్థన్‌తో వెంకట రామరాజు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** బ్రాహ్మణ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య మాజీ అధ్యక్షులు యన్ వెంకటరామరాజు టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు టిడి జనార్థన్‌ను కోరారు. బుధవారం కర్నూలు పర్యటనకు వచ్చిన టిడిపి పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు టిడి జనార్థన్‌ను యన్ వెంకటరామరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకురావాలని, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి అన్ని పథకాలను అమలు చేయాలని, రాష్ట్ర నామినేటెడ్ పదవుల్లో రాయలసీమ బ్రాహ్మణులకు ప్రాధాన్యత కల్పించాలని జనార్ధన్‌ను కోరినట్లు యన్ వెంకట రామరాజు తెలిపారు.

# సచివాలయాల ఉద్యోగుల పై చర్యలు తీసుకోవాలి

**■ ఏపీ మహిళా సమాఖ్య**



**ఎమ్మిగనూరు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** ఎమ్మిగనూరు పట్టణంలో ఇంటి స్థలాల కొరకు దరఖాస్తులను సచివాలయాలలో ఆన్ లైన్ చేయని సచివాలయల అదికారులపై చర్యలు తీసుకోవాలని ఏపీ మహిళా సమాఖ్యపట్టణ అధ్యక్ష కార్యదర్శులు వాణి,ఈరమ్మ లు డిమాండ్ చేశారు. బుధవారం రోజున సిపిఐ కార్యాలయంలో ఏపీ మహిళా సమాఖ్య ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో వస్తే ఇంటి స్థలాలు లేని వారికి పట్టణాలలో 2సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు ఇంటి స్థలాలు ఇస్తామని వాగ్దానం చేయడం జరిగిందని,ఈ హామీ మేరకు పట్టణంలో ప్రజలు ఇంటి స్థలాలకు సచివాలయాలలో ప్రజలు దరఖాస్తు చేసుకోవడానికి వెళితే అక్కడ ఉన్న అధికారులు ఆన్ లైన్ చేసుకోకుండా ప్రజలను సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రధానంగా సచివాలయ ఉద్యోగులు దరఖా స్తులు ఆన్లైన్ చేయకుండా ప్రజలను వివిధ కారణాల తో అప్లికేషన్ వేరే, సైటు లేదు,టైం అయిపోయింది,ఏదో ఒక కల్ల బొల్లి మాటలతో పనులు చెయ్యడం లేదన్నారు.ఈ పద్ధతిలో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారిపైన చర్యలు తీసుకొన్నా రు.రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలాలకు సచ్చివాలయాల లో దరఖాస్తు ప్రకటించిన, స్థానిక తాహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు ఇంటి స్థలాలకు దరఖాస్తులు చేసుకోండి అని సూచించినా సచివాలయ అధికా రు లు మాత్రం ప్రజలు తీసుకొచ్చిన ఇంటి స్థలాలు దరఖాస్తులను ఆన్లైన్ చేయకుండా వేధించడం ఎంతవరకు సబబు అన్నారు. ఇప్పటికైనా సచివా లయాల అధికారులు అలసత్వాన్ని వీడే తక్షణమే పేద ప్రజల ఇంటి స్థలాలకు ఆన్లైన్ చేయాలని లేనిపక్షంలో ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు.

# ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారుల దాడులు



ఎరువుల స్టాక్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు

**హొళగుంద,మేజర్‌న్యూస్ :** హొళగుంద మండలంలోని బుధవారం వ్యవసాయ శాఖ,విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖాధికారులు ఎరువులు,ఫెస్టీ సీడ్స్ దుకాణాలపై దాడులు నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా జరిగే దాడులో భాగంగా కర్నూల్ జిల్లాలో రెండు టీమ్‌లను అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. అందులో రెండవ టీమ్ అధికారులైన సుదర్శరాజు ఏడిఏ,ఆక్టోఆఫ్ కమీషనర్,డైరెక్టర్ వ్యవసాయ శాఖ,వెంకటప్రసాద్ ఇన్స్‌ఫేక్టర్ ఆఫ్ పోలీస్,విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్,సిబ్బంది దాడులు నిర్వహిస్తుండగా వారితో పాటు హొళగుందలోఆలూరు ఏడిఏ చెంగలరాయుడు,మండల వ్యవసాయాధికారి ఆనంద్ లోకదళ్ దాడులు చేపట్టారు.స్థానిక న్యూ ఈరలింగేశ్వర ఫర్టిలేజర్స్ దుకాణం తనిఖీ చేయగా రూ.5 లక్షల విలువ గల భౌతిక,ఈపిఒఎస్ స్టాక్ వ్యత్యాసాలు రావడంతో స్టాక్‌ను అదుపులోకి తీసుకుని అమ్మకాలు నిలుపుదల చేశారు.ఆదేవిధంగా ప్రసన్న ఆంజనేయ సీడ్స్ దుకాణం తనిఖీ చేయగా రూ.2,83,500 లక్షల విలువ ఎరువుల స్టాక్ వ్యత్యాసాలు రావడంతో స్టాక్‌ను అదుపులోకి తీసుకుని అమ్మకాలు నిలుపుదల చేశారు.మొత్తం రూ.7,83,500 స్టాక్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.ఆదేవిధంగా ఇప్పటి వరకు డివిజన్ పరధిలోని ఆదోని,పత్తికొండ ప్రాంతాలలో ఎరువులు దుకాణాలు,ఫెస్టీసీడ్స్ దుకాణాలను తనిఖీ చేపట్టగా రూ.73 లక్షల ఎరువుల స్టాక్ వ్యత్యాసాలు రావడంతో అమ్మకాలను నిలుపుదల చేసినట్లు సుదర్శరాజు ఏడిఏ మేజర్‌న్యూస్‌కు చెప్పారు.రైతులకు సక్రమంగా యూరియా,కాంప్లేక్స్ ఎరువులు,సీడ్స్ అందిస్తున్నారా లేదా అనే కోణంలో తనిఖీలో విచారిస్తామన్నారు. సక్రమంగా అందించకపోతే తనిఖీలో వెల్లడైన సదురు ఎరువుల వ్యాపారస్తులపై చర్యకు కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

# హిందీ టీచర్లకు బదిలీ ఫలాలు అందించాలి

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** హిందీ టీచర్లకు బదిలీ ఫలాలు అందించాలని బహుజన టీచర్స్ ఫెడరేషన్ (బిటిఎఫ్) జిల్లా అధ్యక్షులు కె సతీష్ కుమార్ కోరారు. బుధవారం ఆయన డిఈఓను కలిసి వినతి పత్రం అందచేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రమంతటా ఇటీవల ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలు చేసి ఆర్డర్స్ ఇచ్చారని, అత్యధికంగా హిందీ ఉపాధ్యాయులు బదిలీ ఆర్డర్స్ పొంది కూడా గత పాఠశాలల్లోనే కొనసాగిస్తున్నారని తెలిపారు. దీంతో బదిలలీ ఫలాలు అందక హిందీ టీచర్లు నష్టపోతున్నారని తెలిపారు. ఎక్కడో ఒక స్కూల్‌లో హిందీ టీచర్ సమస్య వస్తుందని ఆ స్థానానికి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తే సరిపోతుందని తెలిపారు. ఈ విషయమై డిఈఓ కమీషనర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారని అర్హులైన వారందరికి బదిలీ ఫలాలు అందేలా చూస్తామని తెలిపినట్లు చెప్పారు.



డిఈఓకు వినతిపత్రం అందచేస్తున్న సతీష్ కుమార్

# సీమ అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక ఇరిగేషన్ ఏర్పాటు చేయాలి



బొజ్జా దశరథరామిరెడ్డి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ ఆశయ సాధన దిశగా రాయలసీమ అభివృద్ధి చెందాలంటే రాయ లసీమకు ప్రత్యేక ఇరిగేషన్ కమిషన్ ఏర్పాటు చేసి సాగు నీటి రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దిష్ట లక్ష్యంతో కార్యాచరణ చేపట్టినప్పుడే రాయలసీమ సస్య శ్యామలం అవుతుందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. బుధవారం నంద్యాల సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజిత ఆంధ్రప్రదే శ్ రాష్ట్ర మూడో ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు రాయలసీమ సాగునీటి రంగ అభి వృద్ధి ప్రభుత్వ లక్ష్యం అని అనేక సందర్భాల్లో ప్రకటించ డాన్ని రాయలసీమ సాగునీటి సాధ సమితి ఆహ్వానిస్తోం దని తె లిపారు. రాష్ట్ర విడిపోయిన అనంతరం అనేక కారణాల వల్ల రాష్ట్రం ఆర్థికమైన ఇబ్బందులు పడుతున్నప్పటికీ సీమ ప్రాజెక్టులలో కేవలం హంద్రీనీవా ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి మల్యాల నుంచి కుప్పం వరకు నీళ్లు అందించాలన్న లక్ష్యంతో భారీగా నిధులను కూడా విడుదల చేసి చాలా వేగవంతంగా చేపట్టిన పనుల వల్ల హంద్రీనీవా ప్రాజెక్టు 6లక్షల ఎకరాల ఆయకట్టు లక్ష్యం సాధించాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. రాయలసీమ సాగునీటి రంగ అభివృద్ధి సమగ్రమైన విధానాన్ని అమలుపరచాలన్నారు. సీమలోని ప్రతి ప్రాజెక్టు అసంపూర్తిగా ఉండడం, తగిన సామర్థ్యంతో రిజర్వాయర్లు, ప్రధాన కాలువలు నిర్మించకపోవడం వల్ల కృష్ణా జలాల లభ్యత ఉన్నప్పటికి కేవలం 8లక్షల ఎకరాల ఆయకట్టుకు మాత్రమే నీరు పొందగలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గుండ్రేవుల రిజర్వాయర్, వేదవతి ఎత్తిపోతల పథకం, సిద్ధశ్వరం అలుగు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని కార్యాచరణను సమగ్రం అత్యంత త్వరగా చేపట్టినప్పుడు మాత్రమే సీమ సస్యశ్యామలం అవుతుందని బొజ్జా పేర్కొన్నారు. ఒక ప్రత్యేక రాయలసీమ ఇరిగేషన్ కమిషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆ దిశగా సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచించి యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణ చేపట్టి సాగునీటి రంగ అభివృద్ధి తోడ్పాడు అందించాలని బొజ్జా కోరారు.

# రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారుల పై చర్యలు తీసుకోవాలి

**ఆదోని, మేజర్ న్యూస్ :** రాష్ట్ర వక్ఫ్‌బోర్డు రాష్ట్ర అధికారులపై చర్యలు తీసుకోవాలని మాజీ వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ నథాడ్ ఇస్మాయిల్ సబ్ పేర్కొన్నారు. అనంతరం సోహేల్ వక్ఫ్ బోర్డు ఇన్స్‌పెక్టర్ ఆదోనికి వచ్చి ఆరు దుకాణాలు, రెండు



ఇళ్లను తనిఖీ చేసి డాక్యూమెంట్లు సీఈఓ వద్దకు పంపడం జరిగింది. 2017నుండి ఇప్పటి వరకు సూసరింటిండెంట్ జాని, క్లర్క్ రహంతుల్లాలు ఫైల్‌ను సీఈఓ, ఛైర్మన్ వద్ద సంతకాలను చేయించి వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడాలని కోరారు. ఈ విషయంపై అధికారులను విజిలెన్స్ విచారణ చేపట్టాలన్నారు. ఆయన వెంట మజ్జిద్ కమిటీ సభ్యులు మహబూబ్ బాష, అన్వర్ సాబ్, ఖాజాలు ఉన్నారు.

సూర్య www.suryaa.com



# చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యం : ఎమ్మెల్యే బుడ్డా

**– సోమయాజులపల్లెలో సుపరిపాలనతో తొలి అడుగు**

**– ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి**

**బండిఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని సోమయాజులపల్లె గ్రామంలో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే బుడ్డాకు స్థానిక తెదేపా నాయకులు అల్లె చెన్నారెడ్డి, అల్లె ఈశ్వర్‌రెడ్డిలు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మహిళలు మంగళ హారతులు ఇచ్చారు. ఎమ్మెల్యే బుడ్డా ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు చేసిన అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాగానే వృద్దులకు, వితంతువులకు రూ. 4 వేలు, వికలాంగులకు రూ. 6 వేలు పింఛన్లు పెంపు నియోజకవర్గాల్లో అన్నా క్యాంటీన్ల ఏర్పాటు, ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు, ప్రతి విద్యార్థికి తల్లి వందనం ద్వారా రూ. 15 వేలు, రైతుకు కేంద్ర ం నుండి వచ్చే నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వడం, ఆగస్టు 15వ తేదీ నుంచి జిల్లా పరిధిలో ప్రతి మహిళకు ఉచితంగా బస్సు సర్వీస్, యువతకు ఉద్యోగాలు, పారిశ్రామిక అభివృద్ధి, ఎస్సీ, ఎస్టీ సబ్



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

~~ప్లాన్ లాంటి కార్యక్రమాలు గత సం~~వత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేసిందని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం చేస్తుందని, పి4 కార్యక్రమం ద్వారా పేదలను ధనికులుగా చేసే కార్యక్రమం కూడా ఆగస్టు నుంచి మొదలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కంచర్ల మనోహర్ చౌదరి, లాయర్ కృష్ణారెడ్డి, పరమటూరు సాయిబాబారెడ్డి, సిద్ధం ప్రతాప్‌రెడ్డి, బైరెడ్డి మధుసూదన్‌రెడ్డి, యర్రగుంట్ల సుబ్బయ్య, తాటికొండ బుగ్గ రాముడు, పరమటూరు శేఖర్, వెంగల్‌రెడ్డిపేట శ్రీనివాసులు, ప్రాన్సీస్, వివిధ గ్రామాల తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమం కోసం పనిచేయండి - ఎమ్మెల్యే కోట్ల



సహక సంఘము సొసైటీ చైర్మన్ గా ఉన్నాం చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరణ

**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** బేతంచెర్ల మండలం పరిధిలోని కొలుములపల్లె గ్రామానికి చెందిన ఉన్నం చంద్రశేఖర్ వ్యవసాయ సహకార సంఘము సొసైటీ చైర్మన్ గా,డైరెక్టర్లుగా శంకలాపురం గ్రామానికి చెందిన హనుమంత్ రెడ్డి,ఆర్ ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన రాధాకృష్ణలు బుధవారం బాధ్యతలు చేపట్టారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి, రైతుల సంక్షేమం కోసం కృషి చేయాలని అన్నారు.అంతకుముందు ప్రభుత్వ అతిధి గృహం నుండి నాయకులు, కార్యకర్తలు, టిడిపి శ్రేణుల తో ర్యాలీగా సొసైటీ కార్యాలయం చేరుకున్నారు.అనంతరం సొసైటీ సీఈవో ఓబులేష్ చైర్మన్, డైరెక్టర్ లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ల సహకారంతో రైతులకు సేవ చేసే భాగ్యం కలిగిందని,పార్టీలకు అతీతంగా అందరి సహకారంతో రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. మండల కన్వీనర్ ఉన్నాం ఎల్లనాగయ్య, పోలురు రాఘవరెడ్డి, పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్న లక్ష్మి, పోలూరు శ్రీనివాస్ రెడ్డి,భీమేశ్వర్ రెడ్డి,రవీంద్ర నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# 20న బలవంతపు భూసేకరణ పై రాష్ట్రస్థాయి సదస్సు

– కార్పొరేట్ శక్తులకు అప్పనంగా రైతుల భూములు

– జిల్లాలో పొగాకు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

– ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :**రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ఈనెల 20వ తేదీన నంద్యాల జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెప్రభాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం నంద్యాలలోని ఎన్‌పివో కాలనీలో ఉన్న రైతు సంఘం కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు తదితరులతో మీడియా సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సోలార్ ప్రాజెక్టు, గ్రీన్ ఎనర్జీ, ఎస్ఈజడ్‌లు వివిధ ప్రాజెక్టుల పేరుతో శ్రీకాకుళం నుంచి సత్యసాయి జిల్లా వరకు ప్రజాభిప్రాయ సేకరణ లేకుంఆ గ్రామసభల అనుమతి లేకుండా ప్రభుత్వం ఇష్టానుసారంగా భూ సేకరణ చేపడుతూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్త చౌకబారుగా లక్షల ఎకరాల భూములను కట్టబెడుతుందని ఆరోపించారు. 2013 భూ సేకరణ చట్టాన్ని ఉల్లంఘిస్తూ రైతులకు న్యాయంగా ఇవ్వాల్సిన పరిహారాన్ని నిరాకరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక ప్రభావిత అంచనా కూడా లేకుండా భూములు కోల్పోయిన రైతులకు ప్రత్యామ్నాయం చూపకపోవడంతో పాటు ఆ కుటుంబాల్లో ఉపాధి చూపాలని అలాంటిది ఏమి చేయకుండా ప్రభుత్వం రైతుల నుంచి దౌర్జన్యంగా భూములను లాక్కొని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రయత్నం చేస్తుందన్నారు. దీనికి వ్యతిరేకంగా బాధిత రైతులతో రాష్ట్రస్థాయి సదస్సు నంద్యాలలో నిర్వహిస్తున్నామన్నా. ఈసదస్సుకు ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ సుంకర రాజేంద్రప్రసాద్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్యలు




హాజరవుతారని తెలిపారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నంద్యాల జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా నంద్యాల జిల్లా పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రకటన చేయాలని ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాలో 30వేల ఎకరాల్లో రైతులు పొగాకు పండించారని తీరా ఒప్పందం చేసుకున్న కంపెనీలు పొగాకు కొనుగోలు చేయడంలో ముందుకు రాకపోవడంతో పొగాఉకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సీఎం జోక్యం చేసుకుని పొగాకు కొనుగోలు జిల్లాలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాయలసీమ ప్రాంత రైతాంగం పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే వేదవతి గుండ్రేవుల ప్రాజెక్టుల నిర్మాణాలను చేపట్టడంతో పాటు తెలుగంగ, గాలేరు నగరి, హంద్రీనీవా తదితర పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గోదావరి నుంచి బనకచర్లకు నీళ్లు రప్పించి సీమను సస్యశ్యామలం చేస్తానని ఆరులక్షల ఎకరాలకు నీరు ఇస్తామని సీఎం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతాంగం అభివృద్ధికి సీఎంకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న సత్వరమే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ పొగాకు రైతుల పంట్ల ప్రభుత్వం స్పందించాలని రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. జిల్లాలో మార్కెట్ ద్వారా పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం సహాయ కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, సురేష్‌లు పాల్గొన్నారు.

# ఆగష్టు 24న బ్రాహ్మణ సమ్మేళనం, వివాహ పరిచయ వేదిక

**నంద్యాల జిల్లా బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు కె.పి.వి.సుబ్బారావు**



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** బ్రాహ్మణ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆగష్టు 24వ తేదీన కడప లో బ్రాహ్మణ సమ్మేళనం మరియు వివాహ పరిచయ వేదికను బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్రనాయకులు పి వి ఎస్ వి ప్రసాదరావు, సూగురు రఘునాథరావు గార్ల ఆధ్వర్యంలో నిర్వహించ నున్నట్లు బ్రాహ్మణ చైతన్య వేదిక నంద్యాల జిల్లా అధ్యక్షులు కె.పి.వి.సుబ్బారావు తెలిపారు. ఆళ్లగడ్డలో ఆయన బుధవారం మేజర్ న్యూస్ తో. మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రాహ్మణలకు జరిగిన లబ్ది మరియు పెండింగ్ లో వున్న సమస్య లపై సమావేశం లో చర్చించడం జరుగుతుందని తెలిపారు. సమకాలిక సమస్య లపై చర్చించి ప్రభుత్వం దృష్టి కి తీసుకుపోవడం జరుగును. బ్రాహ్మణ సమస్య లపై చర్చ తర్వాత బ్రిబ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహించడం జరుగుతుందని, బ్రాహ్మణ తల్లి తండ్రులు వారి పెళ్లి కాని పిల్లల వివరాలను ఆగష్టు 20వ తేదీలోగా ఈ కింద తెలిపిన ఫోన్ నంబర్స్‌కు వాట్సాప్ ద్వారా 9948664728, 9985620758 పంపాలని, ఇతర వివరాలకు ఈ ఫోన్స్ లో సంప్రదించాలని, ఈ వివాహ పరిచయ వేదికకు వచ్చేవారు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఎటువంటి రుసుము స్వీకరించబడదు అని తెలిపారు.కావున బ్రాహ్మణ బంధువులందరూ ఈ సేవా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

# హైదరాబాద్ వాసి నుండి 10 గ్రాముల కొకైన్ స్వాధీనం

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్‌:** క్రిష్ణగిరి మండల పరిధిలోని అమకతాడు గ్రామ సమీపంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం 4:00 గంటల సమయంలో టోల్ ప్లాజా వద్దనున్న మంజీరా హోటల్ ముందు ఉన్న టీ బంక్ పక్కన రూం వద్ద అనుమానంగా తిరుగుతున్న ప్రకాశం జిల్లా, ఒంగోలు పట్టణానికి చెందిన బెల్లం అఖిల్‌చౌదరి అనే వ్యక్తి వద్ద నుండి 10 గ్రాముల కొకైన్ అనే నిషేధిత మత్తు పదార్థాన్ని కలిగి ఉండగా, వచ్చిన సమాచారం మేరకు కర్నూలు జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్, పత్తికొండ డిఎస్‌పి బి.వెంకటరామయ్యల ఆదేశాల మేరకు క్రిష్ణగిరి పోలీసుస్టేషన్ ఎస్సూ జి.కృష్ణమూర్తి వారి పోలీసు సిబ్బందితో బెంగుళూర్ నుండి హైదరాబాద్‌కు వెళ్తూ, మార్గ మద్యలో అమకతాడు టోల్‌ప్లాజా వద్ద దిగి ఉన్న సదరు బెల్లం అఖిల్‌చౌదరి వద్దనున్న 10 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



నిందితుడు బెల్లం అఖిల్‌చౌదరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

# కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని తెదేపా మండల కన్వీనర్ బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని మెయిన్‌బజారు, కోటా వీధి ప్రాంతాల్లో పర్యటించి ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం దాచుకున్నామా పంచుకున్నామా అనే రీతిన ప్రభుత్వం కొనసాగిందని విమర్శించారు. అలా కాకుండా చంద్రబాబు ఆధ్వర్యంలో సుపరిపాలనకు పునాదులు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉయ్యాలవాడ సాగునీటి సంఘం అధ్యక్షులు ఆకుల చిన్న వెంకట సుబ్బయ్య, కార్యకర్తలు ఈడిగ చెన్నయ్య, ప్రసాద్‌రెడ్డి, అన్వర్, బాల వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్న నాయకులు

# మొక్కజొన్న పంటపై అడవి పందులు దాడి

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** మొక్కజొన్న పంటలకు అడవి పందుల బెడద ఎక్కువై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో అరకొరగా కురిసిన వర్షాలకు సాగు చేసి మొక్కజొన్న పంటలపై అడవి పందులు దాడి చేసి తీవ్ర నష్టం చేస్తున్నాయి. మండలంలోని పెద్దగుమ్మడాపురం గ్రామానికి చెందిన నాగ శేషన్న యాదవ్ అనే రైతు 5 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. మంగళవారం అర్థరాత్రి సమయంలో అడవి పందులు గుంపులుగా వచ్చి మొక్క జొన్న పైరును నాశనం చేశాయి. గతంలోనూ మొక్కజొన్న నాటిన సమయంలో ఇలాగే గుంపులుగా రాత్రి సమయాల్లో వచ్చి మొలకెత్తిన గింజలను తిన్నాయని రైతు తెలిపారు. మళ్లీ పంటను సాగు చేయడంతో అరకొరగా ఉన్న పంటపై దాడి చేయడంతో దాదాపు రూ. లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఒకవైపు వర్షం లేక ఎండిపోతున్న సమయంలో మరో వైపు ఉన్న మొక్కజొన్న పంటలను అడవి పందులు నాశనం చేయడం కలచివేస్తుందని ఆవేదన వ్యక్తం చేశాడు. అటవీ శాఖ అధికారులు నష్టపోయిన పంటలను పరిశీలించి పరిహారం అందేలా చూడాలని కోరారు.



దెబ్బతిన్న పంటను చూపిస్తున్న రైతు

# ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో వసతులు కల్పించండి



ఎంఈఓ శివరాం ప్రసాద్‌తో మాట్లాడుతున్న అభిరుచి మధు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్** :పాఠశాలలు, వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం అందిస్తే విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకుంటారని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు అభిరుచి మధు ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణ శివారులోని బాలికల వసతి గృహాన్ని ఎంఈఓ శివరాం ప్రసాద్‌తో నంద్యాల బీజేపీ అధ్యక్షులు అభిరుచి మధు తనిఖీ చేశారు. దేశవ్యాప్తంగా బీజేపీ అధిష్టానం ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో బీజేపీ నేతలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. వసతి గృహంలో విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు భోజనం చేస్తుండడంతో వారు కింద కూర్చుని టిఫిన్, భోజనం బాగున్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు ఆయనతో మాట్లాడుతూ మంచి రుచికరమైన భోజనం,టిఫిన్ వేడివేడిగా పెడుతున్నారని ఇంటి భోజనం మాదిరిగా ఉందని చెప్పా. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉన్నాయా అని బీజేపీ నిర్ణయం మేరకు బీజేపీ నాయకులు ప్రజల ముందుకు వెళ్తున్నారని అన్నారు. సమాజంలో ఎందరో పేదవారు చదువు, ఆహారం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి తెలుసుకుని ప్రభుత్వ హాస్టల్, వసతి గృహాల్లో చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకున్నారని పేర్కొన్నారు. నంద్యాల పట్టణ శివారులోని కస్తూరిబా బాలికల వసతి గృహంలో తనిఖీలు సంతృప్తినిచ్చాయన్నారు. వసతి గృహంలో గదులు, వంటశాల, క్లాస్‌రూమ్స్ చక్కగా ఉన్నాయన్నారు. అక్కడ చదువుతున్న విద్యార్థినులతో మాట్లాడడంతో ప్రస్తుతానికి మాకు ఎలాంటి సమస్యలు లేవని చెప్పారు. పేద విద్యార్థులు చదువుల కోసం ప్రభుత్వం మరిన్ని సదుపాయాలు కల్పించడానికి సిద్ధం అన్నారు. సరైన కుర్చీలు లేకపోవడంతో సొంత నిధులతో ఫర్నిచర్ అందజేస్తానని హామీనిచ్చారు. ఆర్థికంగా బలపడినవారు ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# 22 తీర్మాణాలకు స్థాయి సంఘం ఆమోదం

**– రూ.7.30 కోట్ల అభివృద్ధి పనులకు పచ్చజెండా**

**– నగర మేయర్ బివై.రామయ్య**



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ బివై రామయ్య

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ ః** నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు నగర మేయర్ బివై రామయ్య అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో స్థాయి సంఘం సమావేశం నిర్వహించారు. మొత్తం 22తీర్మాణాలు ఆమోదించి రూ.7.30కోట్ల అభివృద్ధి పనులకు పచ్చజెండా ఊపారు. ఆమోదించిన తీర్మాణాల్లో కొన్ని 200మంది ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికులు కాల పరిమితి మరో ఐదు నెలలు పొడిగించి అందుకు అవసరమైన రూ.1.72కోట్లు కేటాయించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య కూడలి విస్తీర్ణం తగ్గించి అభివృద్ధి చేయుటకు రూ.25లక్షలు, అశోక్ నగర్‌లో పాలకొట్టాల ప్రాంతంలో డ్రైనేజీ కాలువల నిర్మాణానికి రూ.49.60 లక్షలు, ఎన్ఆర్ పేట నాయుడు అపార్ట్‌మెంట్ వద్ద రూ.22లక్షలతో సిసి రహదారి నిర్మాణం, తుంగభద్ర నది ఓల్డ్ పంప్‌హౌస్ నందు రూ.22.50లక్షలతో వాహనాల గ్యారేజీ నిర్మాణానికి, రాంప్రియ నగర్‌లో రూ.40లక్షలతో బిటి రోడ్డు, బిటిఆర్ నగర్‌లో సిసి, డ్రైన్ రహదారుల నిర్మాణానికి రూ.49లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అదేవిధంగా నగరంలోని పలు ప్రాంతాల్లో మొత్తం రూ.7.30కోట్ల అభివృద్ధి పనులకు ఆమోద ముద్ర వేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ పి విశ్వనాథ్, అదనపు కమీషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమీషనర్ సతీష్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్‌ఓలు జునైద్, ఇబ్రాయిల్, అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్, టిపిఆర్‌ఓ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బనగానపల్లె ఇంఛార్జ్ ఎంపీడీవోగా రాధికారెడ్డి



**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె ఇంచార్జి ఎంపిడిఒగా ఎస్. రాధికారెడ్డి బుధవారం నాడు బాధ్యతలను చేపట్టారు. ప్రస్తుతం సంజామల మండలం డిప్యూటీ ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న ఆమె బనగానపల్లె ఇంచార్జి ఎంపిడిఒగా బాధ్యతలను చేపట్టినట్లు పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా వారిని కలిశారు.

# మధ్యవర్తిత్వం పై వన్‌కే ర్యాలీ




జెండా ఊపి ర్యాలీని ప్రారంబిస్తున్న జిల్లా జడ్జి కబర్థి

**కల్లూరు, మేజర్‌న్యూస్ ః** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, అధ్యక్షులు జి కబర్థి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి దివాకర్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరినాథ్ చౌదరిలు బుధవారం మధ్యవర్తిత్వంపై వన్‌కె ర్యాలీని జెండా ఉపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కర్నూలు న్యాయ సేవా సదన్ జిల్లా కోర్టు ప్రాంగణం నుండి మున్సిఫ్ కోర్టు మీదుగా అంబేద్కర్ సర్కిల్, కొండారెడ్డి బురుజు వరకు సాగింది. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ ప్రజలకు మీడియేషన్ వలన కలిగే లాభాలు అలాగే మీడియేషన్ ఉపయోగించి కేసులను త్వరగా ఎలా పరిష్కరించుతారో తెలియజేశారు. ఈ ర్యాలీలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, అదనపు జిల్లా జడ్జిలు, బార్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, శిక్షణ పొందిన మీడియేషన్ న్యాయవాదులు నాగ శేషయ్య, యువి లక్ష్మి, ఉమాదేవి, ఆశ బాయి, న్యాయవాదులు, ట్రైనీ న్యాయవాదులు, ప్యారా లీగల్ వాలంటీర్స్, పోలీసులు పాల్గొన్నారు.

# బేస్ బాల్ పోటీల్లో బంగారు పథకం




బంగారు పతకం సాధించిన షేక్ మహమ్మద్‌తాహిర్

**ప్యాపిలి, మేజర్ న్యూస్ః** పట్టణానికి చెందిన నడిమిగేరి అంగడి వలి కుమారుడు షేక్ మహమ్మద్‌తాహిర్ డోన్ పట్టణంలోని శ్రీసుధ పాఠశాల నందు చదువుతున్నాడు. ఇటీవల అనతంపురం జిల్లా, కదిరిలో జూలై 9వ తేది నుండి 14వ తేది వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీల్లో పాల్గొని మొదటి స్థానంలో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా తాహిర్ తండ్రి అంగడి వలి బుధవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ నా కుమారుడు బంగారు పతకం సాధించడం చాలా సంతోషంగా ఉందని, అలాగే చదువులో కూడా మంచి మార్కులు సాధించి ఉన్నతస్థాయిలో ఉండాలని కోరుకుంటున్నామన్నారు. చదువుతో పాటు క్రీడలు కూడా ఒక భాగమని, అలాగే ఆరోగ్యంగా బలంగా ఉంటారన్నారు. శ్రీసుధస్కూల్ సిబిఎస్ఈ యాజమాన్యం వారు చదువుతో పాటు క్రీడల పట్ల కూడా చాలా శ్రద్ధతో బోధిస్తారన్నారు. స్కూల్ యాజమాన్యానికి, టీచర్స్‌కు, పిఈటిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం..

**– టీడీపీ నాయకులు రఘునాథ్‌రెడ్డి**



స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న టీడీపీ నాయకులు

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి సోదరులు రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మంత్రాలయం మండల పరిధిలోని బూదూరు గ్రామం ఎత్తిపోతల పథకం ద్వారా స్విచ్ ఆన్ చేసి సాగునీటిని విడుదల చేశారు. ముందుగా ఆయన ఎత్తిపోతల పథకానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంత్రాలయం నియోజకవర్గంలోని భూములకు సాగునీరు అందించడమే రాఘవేంద్రరెడ్డి లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల ఆదాయం పెంపొందించుటకు వారి శ్రేయస్సుకోసం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుధవారం ఎత్తిపోతల పథకం ద్వారా 910 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సర్పంచ్ నాగరాజు, గొల్ల లక్ష్మీకాంత్ యాదవ్, అబ్రహం, మోషి దాసు, భూషణం, ఈరన్న, మంగలి లక్ష్మీకాంత్, రోగప్ప, తదితరులు పాల్గొన్నారు.

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఔదార్యం

**– రూ. 2.50 లక్షలతో అభివృద్ధి పనులు**



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న రమణారెడ్డి కుటుంబ సభ్యులు

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** కోవెలకుంట్ల మండలంలోని లింగాల గ్రామంలో గ్రామ సర్పంచ్ ఎరువ సంజమ్మ కుమారుడు ఎరువ రమణారెడ్డి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఇటీవల తన సొంత గ్రామానికి వచ్చిన రమణారెడ్డిని గ్రామానికి చెందిన కొందరు విద్యార్థులు, ప్రజలు పాఠశాలకు వెళ్ళే రహదారి పూర్తిగా అధ్వాన్నంగా ఉందని, దీంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్ళాలంటే అవస్థలు పడుతున్నారన్న విషయం ఆయన దృష్టికి తీసుకొని వెళ్ళడంతో రమణారెడ్డి స్పందించి రూ. 1.50 లక్ష లతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టి విద్యార్థులకు ఎంతో సౌకర్యం కల్పించడం పట్ల విద్యార్థులు, గ్రామ ప్రజలు రమణారెడ్డిని అభినందించారు. గ్రామంలోని సోమేశ్వర, రామేశ్వర దేవాలయాల చుట్టు కాంక్రీట్ పనులు చేపట్టేందుకు సొంత నిధులు ర. లక్ష వెచ్చించి పనులు చేపట్టారు. మొత్తం రూ. 2.50 లక్షలతో తమ తల్లిదండ్రులైన సర్పంచ్ సంజమ్మ , తండ్రి వెంగల్‌రెడ్డి పేరు మీద అభివృద్ధి పనులు చేపట్టడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో సొంత గ్రామానికి సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడతానని రమణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శేషిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పందుల పోషణకు బస్తిపాడులో స్థలం కేటాయింపు



మాట్లాడుతున్న మేయర్ బివై రామయ్య

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ ః** నగరంలో పందుల బెడద నివారణకు నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా బస్తిపాడులో పందుల పోషణకు స్థలం కేటాయించినట్లు మేయర్ బివై రామయ్య, కమీషనర్ పి విశ్వనాథ్‌లు పేర్కొన్నారు. సోమవారం నగరపాలక కార్యాలయం యుఎ ల్‌బి స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు పందుల పెంపకందారులు బస్తిపాడు నందు ఉన్న 362, 552 సర్వే నంబర్ల నందు 4.15ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందని, పందులను పెంపకందారులు అక్కడికి తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ సతీష్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు శక్తి యాప్

**– వాట్సప్ సేవలపై అవగాహన**



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ ః** అత్యవసర సమయాల్లో మహిళలను కాపాడేందుకు శక్తి యాప్ ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. బుధవారం జిల్లావ్యాప్తంగా ఆయా స్టేషన్ల పరిధిలోని బస్టాండ్, రైల్వే స్టేషన్, షాపింగ్ మాల్‌లు, అంగన్‌వాడి కేంద్రాలు, రద్దీ ప్రదేశాల్లో ప్రజలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినీలు ఆపద సమయలలో 7993485111నంబర్‌ను ఉపయోగించుకుని పోలీసులకు సమాచారం ఇస్తే వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఇదే నంబర్‌కు వాట్సప్ చేసినా ఆ ప్రాంతంలోని పోలీసులు వెంటనే స్పందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీలు, మహిళలు, పోలీసులు పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వం ద్వారా తగాదాలకు శాశ్వత పరిష్కారం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** మధ్యవర్తిత్వం ద్వారా తగాదాలకు శాశ్వత పరిష్కారం పొందవచ్చని సీనియర్ సివిల్ జడ్జి శైలజ, జూనియర్ సివిల్ జడ్జి భాస్కర్ పేర్కొన్నారు. దేశం కోసం మధ్యవర్తిత్వం కార్య క్రమంలో భాగంగా బుధవారం సీనియర్ సివిల్ జడ్జి మరియు జూనియర్ సివిల్‌జడ్జిల ఆధ్వర్యంలో కోర్టు ఆవరణ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీని యర్ సివిల్ జడ్జి శైలజ మాట్లాడుతూ మధ్యవర్తిత్వంతో సమయం వృధా కాదని, వివిధ కేసుల్లో మధ్యవర్తిత్వం చేయడం ద్వారా సమ స్య త్వరితగతిన పరిష్కారమై ప్రయోజనం చేకూరుతుందన్నారు. సామరస్య పూర్వకంగా కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. పెం డింగ్‌లో ఉన్న ఆయా సంస్థల సివిల్,కాంపౌండ్, క్రిమినల్ కేసులు, రాజీపడదగ్గ ఇతర కేసులు గుర్తించి వాటి పరిష్కారం మధ్యవర్తిత్వం ద్వారా ఉపయోగపడుతుందన్నారు. ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి భాస్కర్ మాట్లాడుతూ న్యాయస్థానాల్లో ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న కేసులనుకక్షిదారులు మధ్యవర్తిత్వంతో రాజీకిరావచ్చని పేర్కొన్నారు.




**ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు,న్యాయవాదులు**

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమ ంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు శివరామిరెడ్డి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శివ ప్రసాదరావు, ఏజీపీ బాల గురురెడ్డి, న్యాయవా దులు సూర్యనారాయణ రెడ్డి, నీలకంఠేశ్వరం, డిసి విజయ్, వెంకటే శ్వర్లు, రమాదేవి, షాహినా బేగం, ఎల్ ఓబులేసు, సుబ్బయ్య, హెచ్చివి శేఖర్ తో పాటు కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వసుధా ఫౌండేషన్ సహకారం పేదల ఆరోగ్యానికి భరోసా

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** వసుధా ఫౌండేషన్ సహకారంతో పేదరి కంలో ఇబ్బందులు పడుతూ అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న రోగులను గుర్తించి వారికి ఆర్థిక సహాయం అందించడం పేదల ఆరోగ్యానికి భరోసా లాంటిదని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సతీమణి బి.సి ఇందిరమ్మ అన్నారు. బుధవారంనాడు బనగానపల్లె పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ వాణిజ్య విభాగాల నంద్యాల జిల్లా అధ్యక్షులు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో 40వేలు విలువ చేసే చెక్కులను 7మందికి అందజేశారు. ఈ సందర్భంగా బి.సి ఇంది రమ్మ మాట్లాడుతూ సమాజానికి మంచి చేసే వారు ఆరోగ్యవంతు లుగా ఉండాలని మంతెన వెంకటరామరాజు వారి కుటుంబ సభ్యుల తోపాటు శీనయ్య కుటుంబ సభ్యులు కూడా ఆరోగ్యవంతంగా ఉండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానన్నారు. అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని గుర్తించి భరసా కల్పిస్తున్నారని తెలిపారు. చెరువుపల్లి గ్రామంలో



**చెక్కులు అందజేస్తున్న దృశ్యం**

మతిస్థిమితం లేని యువకునికి వసుధా ఫౌండేషన్ ద్వార ఆర్థిక సహాయం అందించాలని బి.సి ఇందిరమ్మ టంగుటూరి శీనయ్యకు సూచించడం జరిగింది. వీలైనంత వరకు ఫౌండేషన్ ద్వార ఆర్థిక సహాయం అందించేందుకు తమ వంతు కృషి చేస్తానని టంగుటూరి శీనయ్య తెలిపారు. యనకండ్ల ఖాదర్, అవుకు మండల తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు ఉగ్రసేనా రెడ్డి, మదన్ భూపాల్ రెడ్డి, తలారి హరి, రాంబాబు, హర్ష తదితరులు పాల్గొన్నారు.

# 'బంగారు కుటుంబాలు'తో పేదల ఆర్థిక అభివృద్ధి

**-మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుస్సేన్..**

**మిడుతూరు మేజర్ న్యూస్ :** మిడుతూరు మండల పరిషత్ కార్యాల యంలో 'బంగారు కుటుంబాల'పై మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుస్సేన్ అధికారులతో సమీక్షించారు. మండల పరిషత్ కార్యాల యంలో ఎంపీడీవో పి దశరథ రామయ్య ఆధ్వర్యంలో జరిగినది. బంగారు కుటుంబాలపై మండల స్థాయి అధికారులు మరియు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పేదరికం లేని సమాజమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పిఫోర్ కార్యక్రమాన్ని శ్రీకారంచుట్టారు.ఆదాయంలో అట్టడుగు ఉన్న కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఆర్థిక వృద్ధి చెందిన కుటుంబాలు చేతని వ్వాలని పిలుపునిచ్చారు.మండలంలోని ప్రతి గ్రామంలో మార్గదర్శు లను అధిక సంఖ్యలో గుర్తించి మార్గదర్శకులు డబ్బు సహాయమే కాకుండా పేదల కుటుంబంలో చదువుకునే వ్యక్తులకు ఆర్థిక సాయ ం నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ యువత కెరీర్ పై సూచనలు సల హాలు ఇవ్వాలని కోరారు.బంగారు కుటుంబాలను వారికి మ్యాపింగ్ చేయాలని అన్నారు.మిడుతూరు మండలంలో 1,163 బంగారు కుటుంబాలు ఉన్నాయని వారికి అందరికీ బంగారు కుటుంబాలుగా మార్చవలసిన బాధ్యత మండలంలోని అన్ని గ్రామాల గ్రామ పెద్దలు మరియు మండల స్థాయి అధికారులకు,పంచాయతీ కార్య దర్శులకు, వీఆర్వోలకు ఉందన్నారు.ఈరోజు గురువారం సాయం త్రం లోపు మార్గదర్శులను గుర్తించి బంగారు కుటుంబాలకు మ్యాపింగ్ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఫైజున్నిసా బేగం,ఐసీడిఎస్ సూపర్వైజర్ రేణుక మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



**మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్**

# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా కూటమి పాలన కొనసాగుతుందని టీడీపీ యూనిట్ కన్వీనర్ జహీర్‌అహమ్మద్, క్లస్టర్ ఇంచార్జి దాదా సాహెబ్ లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం లో భాగంగా బుధవారం స్థానిక 152వ బూత్‌లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు.ఈసందర్భంగావారు మాట్లా డుతూ ఏడాది పాలనలో ప్రభుత్వం ఏమి చేసిందో ప్రజలకు వివరించడం జరిగింద న్నారు.ప్రజాప్రభుత్వంఏర్పడిఏడాది గడిచిందని,ఏడాదిలోనే రాష్ట్ర అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అంత మందికి ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. రాజకీ యాలు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కటికే బందే నావాజ్,వహాబ్, అబ్దుల్లాకమిటీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.



**కరపత్రాలను అందజేస్తున్న నాయకులు**

# ప్రతిఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**-పూలకుర్తి ఎత్తిపోతల పథకంను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి**



**ఎత్తిపోతల పథకంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి**

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** ప్రతిఎకరాకు సాగు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నా రు. బుధవారం మండలంలో పూలకుర్తి ఎత్తిపోతల పథం ప్రారంబానికి గుండ్రేవు ల గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఎత్తిపోతల పథకం మోటార్ స్విచ్‌ఆన్ చేసి ప్రారభించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పూల కుర్తి ఎత్తి పోతలపథకం ఎల్‌ఎల్ సి పరిధిలో ఉందని ఈ పథకం ద్వారా9830ఎకరాలకు వ్యవసాయానికి అవసరాలకు తగట్టు సాగునీరు అందించుకోవచ్చని తెలిపారు.ఈపథకం ద్వారా వ్యవసాయనికి సాగునీరు విడుదల చేయడం చాలా సంతోషంగా ఉందని సూచిం చారు.ఈకార్యక్రమంలో ఇరిగేషన్ డిఈ చిత్తంబర రెడ్డి,కోడుమూరు ఎల్ ఎల్ సి ఏఈ సుబ్బారాయుడు,డిసి-9 చైర్మన్ గుడిపాడు మహేశ్వర రెడ్డి,డిసి-10 చైర్మన్ ధర్మారెడ్డి,డిసి చైర్మన్ మాధుసూదన్ రెడ్డి,డబ్లీఏలునరసింహులు, వడ్డే లక్ష్మన్న, చిన్న రంగన్న, చిన్న తిమ్మప్ప తోపాటు టీడీపీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆదోనిలో మీడియేషన్ ఫర్ ద నేషన్ వన్‌కే వాక్ ర్యాలీ

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** సుప్రీంకోర్టు గైడ్ లెన్స్ ప్రకార ంఆంధ్రప్రదేశ్ ఏపీ స్టేట్ అండ్ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ వారి ఉత్తర్వులు మేరకు 'మీడి యేషన్ - ఫర్ ద నేషన్' కార్య క్రమంపై.. సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ కం చైర్మన్ మండ ల్ లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఆదోనిలో వన్‌కే వాక్ ర్యాలీ నిర్వహించారు. మీడియేషన్ ఫర్ ద నేషన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి, అసిస్టెంట్ సెషన్ జడ్జి, జేఎఫ్ సిఎం మెజిస్ట్రేట్, ఆదోని డీఎస్పీ, బార్ అసోసియేషన్ సభ్యులు మరియు లాయర్లు అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ కోర్టు ఆవరణం నుంచి రోషన్ లాడ్జ్, భీమాస్ సర్కిల్ మీదుగా వెళ్లి తిరిగి కోర్టు దగ్గరకు చేరుకుంది. మధ్యవర్తిత్వం వల్ల సామరస్య పూర్వకంగా కేసులను పరిష్కరించుకో వచ్చని ప్రజలకు వారు అవగాహన కల్పించారు. ఈ ర్యాలీ సందర్భంగా పట్టణంలో ఎలాం టి ట్రాఫిక్ అవాంతరాలు జరగకుండా ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు పర్యవేక్షించారు.




# డిప్యూటీ ఎంపిడిఓపై నాయకుడి దాడి

**కార్యదర్శిని దుర్భాషలాడిన వైనం**

**చాగలమర్రిలో పి4 గ్రామ సభలో గందరగోళం**

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** మండలంలో ఆధికార టిడిపి దౌర్జన్యకాండ ఆగడం లేదు. చాగలమర్రి కి చెందిన చోటా నాయకులు కూడా ప్రోటోకాల్ లేక పోయిన పి4 గ్రామ సభకు ఆహ్వానించలేదని ఏకంగా డిప్యూటి ఎంపీ డిఓ తాహెర్ హుసేన్పై నానా దుర్భాషలాడి, చొక్కా పట్టుకొని దాడికి దిగిన సంఘటన నంద్యాల జిల్లా, మండల కేంద్రమైన మేజర్ గ్రామపంచాయితీ కార్యాల యం చాగలమర్రిలోని చోటు చేసుకుంది.బాధిత డిప్యూటి ఎంపీడిఓ తాహెర్ హుసేన్ తెలిపిన వివరాల మేరకు మేజర్ గ్రామ పచాయితీ ఈఓ తారకేశ్వరి బుధవారం రోజే విధులను స్వీకరించడంతో పీ4 గ్రామ సభను డిప్యూటి ఎపిడిఓ తాహెర్ హుసేనన్ను నిర్విహి ంచాలని అధికారులు ఆదేశించటంతో ఆయన పి4 గ్రామ సభకు అధ్యక్షత వహించారు. ఈ గ్రామ సభలో చాగలమర్రిలోని 461 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న మాజి సర్పంచ్ ఎంఎస్ అన్సర్భాష, ప్రోటోకాల్ ప్రకారం ఎంపీటిసి సభ్యులు. వారు మేంబ ర్లు హాజర యయారు. ఈ క్రమంలో గ్రామసభమొక్క ముఖ్య ఉద్దేశాన్ని తాహెర్ హుసేన్, పంచాయితీ ఈఓ తారకేశ్వరి లు తెలియ పపర్చారు. ఆనంతరం నేషనల్ శానిటేషన్ స్వీపర్లు జాన్, అలీషమ్మ, రాయలమ్మ, వేంకటేశ్వర్లు, సునితతో పాటు మరో 30 మందిని దుశ్శాలువ, పూలమాలలతో సాన్మానించారు. ఇదీలా ఉంటే ఎంపీడిఓ కార్యాలయంలో ఎంపీడిఓ రాజేంద్రప్ర సాద్, ఈఓ తారకేశ్వరి తో పాటు కూర్చోని ఉన్న డిప్యూ టి ఎంపీడిఓ తాహెర్ హుసేన్పై టిడిపి చోటా నాయకు డు సల్లా నాగరాజు అతని మనుషులతో వచ్చి అనరాని పదజాలంతో దూషించి, నానా దుర్భాషలాడి గ్రామ సభకు నన్ను ఎందుకు ఆహ్వానించలేదని, నువ్వు రాజకీ యాలు చేస్తున్నావంటు దాడి చేసినట్లు ఆయన తెలిపా రు. కళ్ళేదుటే జరిగిన దాడిని చూసి ఎపీడిఓ



**సభలో మాట్లాడుతున్న డిప్యూటీ ఎండిఓ తాహిర్ హుస్సేన్**

రాజేంద్రప్రసాద్. ఈ ఓ తారకేశ్వరి లో నిర్ఘాంత పోయా రు. ఈ క్రమంలో ఆయన దాడి విషయాన్ని ఉన్నత అధికారులు, స్థానిక ఎమ్మెల్యేకుఫోన్లో తెలుపుతూ కన్నీటి పర్యంతం అయ్యారు. ఆయనను ఎంపిడిఓ రాజేంద్రప్ర సాద్, ఈఓ తారకేశ్వరి ధైర్యం చెప్పి ఓదార్చారు. ఈ సందర్భంగా జరిగిన దాడి సంఘటనపై ఆయన స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

**సమస్యలను సమస్యలను అడిగితే రౌడీల వ్యవహరించడం సబబ ..చల్ల నాగరాజు :** ప్రజా సమస్యలపై పి ఫోర్ సభలో అడుగుతే సంబంధిత అధికారి రౌడీ లా వ్యవహ రించడం సబ బు కాదని తెలపడంతో పై దురుసుగా ప్రవర్తించ డం అధికారికి తగదని తెలుగుదేశంపార్టీ నంద్యా ల జిల్లా బీసీ సంక్షేమ ఫోక్ పర్సన్ చల్ల నాగరాజు యాదవ్ వివరించారు.ఈ సందర్భంగా నాగరాజు వివర ణ ఇస్తూ పి ఫోర్ సభలో గ్రామంలోని ప్రజా సమస్య లపై మేజర్‌గ్రామపంచాయతీ సర్వోన్నతాధికారి తారకే శ్వరుని అడుగుతుండగా డిప్యూటీ ఎండి ఓ నాపై దురు సుగా మాట్లాడుతూ నీవు ఎవరు గ్రామం లో నన్ను సమస్యలపై నిలదీయడం నీకు తగదని నన్ను హెచ్చరిం చారు. నేను సామదానంగా వివరిస్తున్న నాపై దురుసు గా రౌడీ లాగ ప్రవర్తించాడని ఆయన వివరణ ఇచ్చారు.



**చల్ల నాగరాజు**

## విత్తన, ఎరువుల దుకాణాలలో వ్యవసాయ విజిలెన్స్ అధికారుల తనిఖీలు



**ఆళ్లగడ్డ , మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణంలోని పలు విత్తనమరియుఎరువుల దుకాణాలను వ్యవసాయ విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పలు రికార్డులను పరిశీలించారు. రు. 2,95,000 కు సంబంధించి సీడ్స్కు సరైన రికార్డులు లేకపోవడంతో వాటిని అమ్మ వద్దని ఆదేశాలు ఇచ్చారు. ధనలక్ష్మి ,వెంకటేశ్వర,మహాలక్ష్మి, అగ్రిటెక్ తదితర దుకాణాలను అధికారులు తనిఖీ చేయడం జరిగింది. ఈ తనిఖీల్లో బద్వేలు ఏడిఏ నరసింహారెడ్డి, విజిలెన్స్ ఎస్ఐ గోపాలుడు, ఆళ్లగడ్డ ఏడిఏ విజయ శేఖర్, ఏవో కిషోర్ కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు.

## ఘనంగా నైపుణ్య దినోత్సవం



**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** ప్రపంచ నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాల జిల్లా చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా సోమవారం నాడు నైపుణ్య ప్రాధాన్యతపై ఓవిశిష్ట కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జీవయ్య అధ్యక్షతన విద్యార్థులకు వృత్తి విద్యలో చొరవను పెంపొందించేలా రూపొందించిన ఈ కార్యక్రమం అభినందనీయంగా నిలిచింది. పాఠశాలలో అందుబాటులో ఉన్న వృత్తి విద్య కోర్సులపై విద్యార్థులలో అవగాహన పెంచే విధంగా క్విజ్ పోటీలు, రోల్ ప్లేలు నిర్వహించారు. మై ట్రేడ్ మై డ్రీమ్ పేరిట నిర్వహించిన డ్రాయింగ్ పోటీలు, కేస్ స్టడీస్ మరియు విద్యార్థుల ప్రాజెక్టులతో రూపొందించిన కెరీర్ పాత్ చార్ట్స్ విజిటర్లను ఆకట్టుకున్నాయి. విద్యార్థుల్లో నైపుణ్యాల పట్ల ఆసక్తి పెంచేలా ఈ కార్యక్రమం ప్రభావితం చేసింది. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శాస్త్రి, మహబూబ్ బాషా,వృత్తి విద్యఇన్స్ట్రక్టర్,బాలయ్య(ఐటి)జివికె.రెడ్డి (ఎలక్ట్రానిక్స్),తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు అందరూ విద్యార్థుల్లో నైపుణ్య సాధన ఎంత ముఖ్యమో వివరించారు. నేడు మార్కెట్లో అవకాశాలు ఎలా మారిపోతున్నాయో, వాటిని అందుకోవాలంటే విద్యతో పాటు వృత్తి నైపుణ్యం అవసరమని స్పష్టం చేశారు. నైపుణ్యం ఉన్న విద్యార్థే భవిష్యత్ విజేత" అనే సందేశాన్ని ఈ కార్యక్రమం స్పష్టంగా ప్రకటించింది.

## అక్రమంగా ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవు - ఎ.ఒ

**అవుకుమేజర్,న్యూస్ః** అవుకు మండలంలోని కిరణ్ ఫర్టిలైజర్ మరియు పెస్టిసైడ్స్ నందు మాకు రాబడిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా యూరియా 1170 మరియు కాంప్లెక్స్ ఎరువులు 570 సంచులకు సంబంధించి ఇన్వాయిస్ మరియు స్టాక్ రిజిష్టర్ సరిగా లేనందున అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదల చేయడం జరిగింది. అంతేకాకుండా రసాయనిక ఎరువులు అమ్మే ప్రతి డీలర్కు తెలియజేయడం ఏమనగా యూరియా అధిక ధరలకు అమ్మినట్లయితే వారిపై రసాయనిక ఎరువుల చట్టం 1985 మరియు నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కఠినమైన చర్యలు తీసుకొనబడతాయని తెలిపారు.

## ఇంటింటికి సంక్షేమ పథకాలు అందించడమే టీడీపి ధ్యేయం..



కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ బిటి.నాయుడు. పూల నాగరాజులు

**హాలహర్వి, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ ఏడాది సుపరి పాలనలో భాగంగా ఇంటింటికి సంక్షేమ పథకాలను అందించడమే టీడీపిధ్యేయమని ఎమ్మెల్సీ బిటి.నాయుడు, ఆలూరు టీడీపి పరిశీలకులు ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ పూల నాగరాజులు అన్నారు. బుధవారం హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్థానిక టీడీపి నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి టీడీపి ఏడాది కాలంలో చంద్రబాబు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియ చేశారు. అలాగే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో వృద్ధాప్య పింఛన్లు, తల్లికి వందనం, రోడ్లు, త్రాగు నీటి సౌకర్యాలు, పరిశ్రమలు, ఉపాధి వంటి అన్ని రంగాలలో గణనీయమైన మార్పు తీసుకురావడం జరిగిందని తెలియజేశారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి లింగప్ప,మండల కన్వీనర్ సుధాకర్,క్లస్టర్ ఇంచార్జి ప్రహ్లాద రెడ్డి,కృష్ణమ నాయుడు, ప్రకాష్ ,నాగరాజు,దిబ్బలింగ, లింగ మల్లప్ప, స్థానిక ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పలురకాల పంటల ద్వారా రైతులకు ఆదాయం

**బనగానపల్లెరూరల్మేజర్,న్యూస్ః** క్షేత్రస్థాయిలో రైతులు పలురకాల పంటలను సాగు చేయడం ద్వార ఆదాయం సమకూరుతుందని సిపిఎం శ్రీనివాసులు అన్నారు. బనగానపల్లె మండలంలోని యనకండ్ల, కైప గ్రామాల్లో లత ,నారాయణ రెడ్డి, సురేష్, రామరాజు, ఆదర్శ రైతుల పొలాలను నవధాన్యాల ద్వార సాగు చేస్తునన పొలాలను వారు వేసిన పంటలపై అనుభవాలు కషాయాలు, తెగుళ్ల నివారణకు ఏవిధంగా వాటిని వాడారు , దిగుబడులు ఏవిధంగా పెంచుకున్నారు ఒకే పంట రకం కాకుండా పలు పంటల ద్వార ఆదాయం పొందవచ్చన్నారు. ఈ విధానాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాలు చల్లుకొని పోషక లోపాలు తగ్గించుకొని కార్బన్ శాతం పెరుగుదలకు 365రోజులు పెట్టుకొనే విధంగా కృషి చేస్తే మరింత దిగుబడులు పెంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిపిఎం సలాం, స్టాఫ్ రవీంద్రాచారి, విజయ భాస్కర్, మౌనిక, యూనిట్ ఇంచార్జి లత, డిజిటల్ సోమశేఖర్, ఐసిఆర్పిలు, కులాయి స్వామి, శివ, రామమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపైనే మూగజీవాలు.. వాహనదారుల తిప్పలు

**పశువుల సంచారంతో పట్టణవాసుల ఇబ్బందులు**

**ప్రమాదాల బారిన పడుతున్న వాహనచోదకులు, పాదచారులు**

**పశువుల సంచారాన్ని కట్టడి చేయాలంటున్న ప్రజలు**



పోలీస్ స్టేషన్ ముందు మూగజీవుల సంచారంతో ఇక్కట్లు

**ఎమ్మిగనూరు అర్బన్, మేజర్ న్యూస్:** ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రధాన రోడ్లపై మూగజీవాలు విచ్చలవిడిగా సంచరిస్తుండటంతో ప్రజలకు, పాదచారులకు,వాహనచోదకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధాన రహదారిలో పశువులు సంచరించడమే కాక రహదారులపై ఉన్నవ్యర్థాలను చిందరవందర చేస్తున్నాయి. పట్టణంలోని శ్రీనివాస సర్కిల్, వైయస్సార్ సర్కిల్, సోమప్ప సర్కిల్, శివ సర్కిల్తో పాటు ఆర్టీసీ బస్టాండ్, గోనెగండ్ల బైపాస్ రోడ్డు ఇలా పలు ప్రాంతాలలో పశువులు మందలు మందలుగా తిరుగుతూనేవున్నాయి. ఈ మార్గాలలో బస్సులు, కార్లు, ఆటోలు తదితర మోటార్ వాహనాలు తిరుగుతుంటాయి. అయితే వీటి హారన్ల శబ్దాలకు బిత్తరపోయి చెల్లాచెదరయ్యి ప్రమాదాలుజరుగుతునే ఉన్నాయి. అంతేకాక పట్టణ ప్రధాన కూడళ్ల వద్దఅవితిష్ట వేయడంతోపాదచారులు, వాహనచోదకులకు, ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడటంతో పాటు పలు సందర్భాల్లో ప్రమాదాల బారినపడి ఆసుపత్రులపాలవుతున్నఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ కొంతమంది వీటి యజమానులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రోడ్లపై ఉన్న పశువుల సంచారంపై అధికారులు దృష్టి పెట్టకపోవడం ఏమిటంటూ పట్టణ ప్రజలు, పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు, వాహనదారులు సర్వత్రా విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

# టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** టీడీపీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం అని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అలువాల, చిన్నమరివీడు గ్రామాలలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు అలువాల గ్రామాలలో టీడీపీ కార్యాలయం ను బీవీ ప్రారంభించారు. అలాగే చిన్నమరివీడు గ్రామంలో తాగునీటి పథకం నుంచి గ్రామంలోని కొళాయిలకు నీటిని విడుదుల చేశారు రెండు గ్రామాలలో ఇంటింటికి తిరిగి టీడీపీ చేపట్టిన పలు సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎంవీఎస్ స్కీం కింద రూ.19.5 కోట్లుతో 14గ్రామాలకు తాగునీటి పథకంను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రమైన గోనెగండ్లలో





కూడా జలజీవన్ మిషన్తో తాగునీటి సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలోనే స్థానిక ప్రజాప్రతినిధులకు గ్రామాభివృద్ధికి నిధులు విడుదల అయ్యాయని తెలిపారు. చదువుకునే ప్రతి విద్యార్థికి తల్లికివందనం కింద రూ. 13 వేలు అందించామని, ఆర్టీసీ ద్వార మహిళలకు ఉచిత బస్సును కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఏర్పడిన ఏడాది కాలంలో అభివృద్ధి పనులు ఏమి జరిగాయి. ఇంకా ఏమి జరుగుతాయో ప్రజలకు వివరించారు. ఏడాది కాలంలో గోనెగండ్లలోని మండలంలోని పలు గ్రామాలలో రూ.4.65కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజి ఏర్పాట చేశారని తెలిపారు. ఆర్డీఎస్ కెనాల్ ద్వార మన ప్రాంతంలో 40వేల ఎకరాలకు నీరుఅందిస్తుందని క్యాబినెట్లో సీఎం ఆర్డీఎస్కు గ్రీన్సిగ్నల్ ఇచ్చారన్నారు. రాయలసీమ ప్రాంతంలోని అన్ని ప్రాజెక్టులను హరి చేసేందుకు టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుపతయ్యనాయుడు మలయ్య బేతాలబడేసా తిమ్మారెడ్డి రాజేష్ చిన్ననేలటూరు నాగన్న, రహంతుల్లా, చంద్రశేఖర్, బాషా, నూర, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వం ద్వారా కేసులు రాజీ చేసుకోవాలి

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఇరు పార్టీలకు మధ్యవర్తిత్వం వల్ల కలిగే ప్రయోనాలు వివరించి కేసులు రాజీ చేసుకోవాలని జూనియర్ సివిల్ జర్జి ఎమ్మిగనూరు ఇంచార్జి కె. హేమ పేర్కొన్నారు. ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు రసీదుల్లాతో కలిసి న్యాయవాదులు స్థానిక కోర్టు దగ్గర నుంచి వైయస్సార్ సర్కిల్ వరకు మధ్యవర్తిత్వంపై ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమర్గమని, మధ్యవర్తితో కేసులులు రాజీ చేసుకోవాలన్నారు. కేసుల రాజీ చేసుకోవడంతో కక్షిదారుల సమయం, డబ్బు ఆదా, కోర్టుల చుట్టూ తిరిగే అవసరం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆనంద్, మురళీకృష్ణ, దామోదర్ రెడ్డి, రఘురాం, రామకృష్ణ, రామ్




ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

మూర్తి, యేసేపు, ప్రసాద్, శీను, విజేయ్, రంగన్న, లింగ మూర్తి, తిమ్మప్ప, దస్తగిరి,రమణ,జగన్నాథ్ రెడ్డి, మురళి, కదిరికోట సామెల్. తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఉచితంగా కంది చిరుసంచులు పంపిణీ

**వెల్దుర్తి, మేజర్న్యూస్ః** మండల పరిధిలోని బింగిదొడ్డి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయశాఖ అధికారి అక్బర్భాషా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పత్తికొండ సహాయ సంచాలకులు ఏ.మోహన్విజయ్కుమార్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎల్ఆర్జి52 కంది రకం చిరు సంచులను ఒక్కొక్క రైతుకు 4 కేజీల చొప్పున ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో ఎల్ఆర్జి 52 కంది రకం రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. కావున కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి తీసుకోవాలన్నారు. వివిధ పంటలలో ఎరువుల యాజమాన్యం, సస్య రక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. వేరుశనగ పంటకు పూత దశలో ఎకరానికి 200 కేజీల చొప్పున జిప్సం వేయడం వలన పంట దిగుబడి గణనీయంగా పెరుగుతుందన్నారు.

**సస్యరక్షణ చర్యలు చేపట్టండి ః** ఎస్.పేరేముల గ్రామంలో సాగుచేసిన పత్తిపంటను పరిశీలించామని, వర్షాభావ పరిస్థితుల వలన రసం పీల్చే పురుగులు అయిన తామర పురుగులు, పచ్చదోమ, పేనుబంక ఆశించడం జరిగిందని, అందుకు నివారణ కొరకు ఎకరానికి ఇమిడాక్లోప్రిడ్ 60 గ్రాములు లేదా థయోమిథాగ్జామ్ 40గ్రాములు లేదా ఆసిటామిప్రిడ్ 40 గ్రాముల ముందును వేపనూనె 1500 పిపిఎం లీటర్ నీటికి 5ఎంఎల్తో కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అజయ్భార్గవ్, రైతుసేవా కేంద్రం సిబ్బంది లింగన్న, రైతులు పాల్గొన్నారు.




వైద్యులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు


సమయం దాటిపోయిందని బాధితురాలిని తిరిగి పంపిస్తున్న డాక్టర్

# సమయం12 దాటితే... రేపు రావాల్సిందే..!

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి నందు వైద్యం కోసం వచ్చే ఉమ్మడి జిల్లాల్లోని ప్రజలు ఓపి విభాగాలలో వైద్యం కోసం వెళితే 12దాటితే రేపు రావాల్సిందనే మాట తప్ప మరో మాట వినపడదని ఉమ్మడి జిల్లాలోని మారుమూరు గ్రామాల నుంచి వైద్యం కోసం వచ్చే ప్రజలు ఆవేదనతో వెనుదిరిగి వెళుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత వైద్యం కోసం వచ్చి జూనియర్ వైద్యులు వైద్యం అందించడంలో విఫలం కావడంతో తప్పక ఆరోగ్యం కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. దీనికి కారణం ప్రభుత్వ ఆసుపత్రుల్లోని కార్డియాలజీ, యూరాలజీ విభాగంలోని వైద్యం అందించే వైద్యులు ఆయా వార్డులలోని స్టాఫ్‌కు మధ్యాహ్నం 12గంటల వరకే ఓపిలు తీసుకోవాలని ఆర్డర్ వేసినట్లు సిబ్బంది తెలిపారు. వైద్యులు చెప్పినది విని వైద్యం కోసం వచ్చే ప్రజలను 12లోపల రావాలని 12దాటితే రేపు రావాల్సిందేనని తిరిగి పంపిస్తున్నట్లు ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అదేవిభాగాలకు సంబంధించిన డైలీ ఓపి మాత్రం మధ్యాహ్నం 1వరకు ఓపి సెక్షన్‌లో వైద్యం కోసం వచ్చే ప్రజలకు ఓపి ఇస్తున్నారు. కానీ కార్డియాలజీ, యురాలజీ విబాగాలలో వైద్యులు మాత్రం 12వరకు వైద్యం అందిస్తామంటూ 12దాటిన తర్వాత వైద్యులు కనబడక పోవడంతో ఆ విబాగాల్లో ఉన్న స్టాఫ్ నర్సులు, సెక్యూరిటీ సిబ్బందితో ప్రజలను తిప్పి పంపుతున్నారని వైద్యం కోసం వచ్చే ప్రజలు బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విభాగాలలో వైద్యులు లేకున్నా ఫ్యాన్లు మాత్రం తిరుగుతూనే ఉంటాయి. వైద్యం నేర్చుకునేటప్పుడే ప్రజలకు వైద్యం అందించడంలో ఇంత నిర్లక్ష్యం వహించే పిజీ వైద్యులు వారిపై ఉన్న సీనియర్ వైద్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి అధికారులు చొరవ తీసుకుని మారుమూల గ్రామాల నుండి వచ్చే ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయా లేదా అని తనిఖీలు చేసైనా తెలుసుకోండి. ప్రతిరోజు ఇదే తంతు జరుగుతున్నట్లు వైద్యం కోసం వచ్చే ప్రజలు ఆవేదన చెందుతూ ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నతాధికారులకు ఇది పట్టదా..

# గ్రామీణ వైద్యుల మహాసభ విజయవంతం


మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రామీణ వైద్యుల మహాసభలో కర్నూలు నగరంలోని బిర్లా గేటు సమీపంలో ఉన్న లక్ష్మి కళ్యాణ మండపం నందు డాక్టర్ కెజీ గోవిందరెడ్డి అధ్యక్షతన కర్నూలు అధ్యక్షులు శ్రీనివాసులు, నంద్యాల జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరెడ్డిల ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు జనార్ధన్, మంత్రి టీజీ భరత్, ఎంపి బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు కెఈ శ్యాంబాబు, గౌరు చరిత రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సంక్షేమం కోసం ఎటువంటి సమస్యలున్నా పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు మా వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామ స్థాయిలో ప్రజలకు ప్రథమ చికిత్స చేయాలంటే గ్రామీణ వైద్యులు ముఖ్యపాత్ర పోషిస్తారన్నారు. మీసేవలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాష్ట్రంలో గ్రామీణ వైద్యులు దాదాపు 60వేలకు పైగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల్లోని గ్రామీణ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘం అధ్యక్షులుగా రంగప్ప ప్రమాణస్వీకారం...


బాధ్యతలు చేపట్టిన రంగప్ప

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సం ఘం అధ్యక్షులుగా చందోలి గ్రామానికి చెందిన తలారి రంగప్ప, డైరెక్టర్లుగా ఎరుకల చెరువు సురేంద్ర, పందికోన జగన్నాథంలు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రంగప్ప మాట్లాడుతూ, వ్యవసాయ సహకార పరపతి బ్యాంకు ద్వారా రైతు ప్రయోజనాల కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే కె.ఈ శ్యాంబాబు తనను ఈ పదవికి ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు అధ్యక్షులు రంగప్పను శాలువ పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కెఈ హరిబాబు, తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాల తిరుపాల్, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి రామనాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తినలోకనాథ్, ఎంపిటీసీ రాజు,ఆదినారాయణ, శ్రీనివాసులు గౌడ్, వివిద గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# దాతలే మనకు దేవుళ్లు

## – మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్


డాక్యుమెంట్లు అందచేస్తున్న టీజీ వెంకటేష్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** దాతలే మనకు దేవుళ్లు వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. బుధవారం నగరంలో జరిగిన వాసవి సత్ర సముదాయం సమావేశానికి రాజ్యసభ మాజీ సభ్యులు, గౌరవ అధ్యక్షులు టీజీ వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ సామాన్య భక్తులను దృష్టిలో ఉంచుకుని వసతి ఏర్పాట్లు చేయాలన్నారు. సంస్థ అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నెలలోనే తిరుపతి, విజయవాడలలో మా సంస్థకు సంబంధించి అన్న సత్రాలు ప్రారంభమవుతాయన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ఇల్లూరి లక్ష్మయ్య మాట్లాడుతూ భవిష్యత్తులో అరుణాచలం అయోధ్య మంత్రాలయం, యాదగిరి గుట్టలో మా సంస్థలు ఏర్పాటుకు స్థలం పరిశీలిస్తున్నామని తెలియజేశారు. పంగులూరు సీతమ్మ డెవలప్‌మెంట్ అసోసియేషన్ తరుపున తిరుపతిలో రూ.40కోట్లు విలువ చేసే స్థలం వాసవి సంస్థకు 30ఏళ్లకు ఎంఓయు రిజిస్టర్ డాక్యుమెంటన్ అందచేయడం జరిగింది. రిస్కి పంపి అక్కడ కూడా తిరుపతికి వచ్చే యాత్రికులకు వసతి, అన్నదానం ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. తదనంతరం సంస్థ సభ్యులందరు కలిసి టీజీ వెంకటేష్‌ను దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

# గత పాలకుల హయాంలో నాశనమైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం..

## రాష్ట్ర మంత్రి టి.జి భరత్


ఇందిరాగాంధీ నగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి టి.జి భరత్

**కర్నూలు,మేజర్‌న్యూస్‌బ్యూరో:** ఐదేళ్లు అభివృద్ధికి నోచుకోని రాష్ట్రాన్ని తమ ప్రభుత్వం వచ్చాక గాడిలో పెడుతున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని ఇందిరా గాంధీనగర్‌లో ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ఏ ఏ పథకాలు అందాయని అడిగి వివరాలు తెలుసుకున్నారు. తల్లికి వందనం డబ్బులు తల్లుల అకౌంట్లో జమ చేశామని, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేస్తామని ఆయన చెప్పారు. ఇంటింటికి తిరుగుతున్న సమయంలో ప్రజలు పెన్షన్ల సమస్యలను ఎక్కువగా చెబుతున్నారని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కొర్రీలు పెట్టి పెన్షన్లను కట్ చేశారని అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తు న్నామని ఆయన చెప్పారు. గత ఐదేళ్లలో అన్ని వ్యవస్థలను నాశనం చేశారని.. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మళ్లీ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో ముందుకు తీసుకెళుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామ న్నారు. తమ ప్రభుత్వంలో జరుగుతున్న మంచి పనుల వల్ల ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని మంత్రి అన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వాన్ని ప్రజలందరూ మెచ్చుకుంటున్నార ని చెప్పారు. ఈ కార్యక్రమంలో తమ పార్టీ నా యకులమందరం భాగస్వాములై ఇంటింటికి ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని వివరిస్తున్నట్లు చెప్పారు.

నేటి దినపత్రిక సూర్యకు 19వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
శ్రీ శారదా శిల్ప కళామందిరం
నంద్యాల రోడ్డు, ఆళ్లగడ్డ.
దేవాలయ నిర్మాణము, రాతి విగ్రహములుతయారు చేయబడును.
ఈ విద్య నేర్చుకొనుటకు ఆసక్తికల వారు (10 పాస్, ఫెయిల్) చదివి ఉండవలెను.
నెలకు రూ.1500లు స్టైఫండ్ ఇవ్వబడును.
శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి కల్పించబడును.
ఆసక్తి గల వారు కింది నెంబర్లను సంప్రదించగలరు.
9849211807, 9908462367,



శిల్పి : డి రవీంద్రాచారి
తండ్రి కీ.శే డి బాలవీరాచారి
ఏపి టూరిజం ఉత్తమ అవార్డు గ్రహీత,
సువర్ణ హస్త ఘంటా కంకణ సన్మానికులు

నేటి దినపత్రిక సూర్యకు 19వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
నిర్భయంగా వార్తలు ప్రచురిస్తూ ప్రజల పక్షాన పోరాడుతున్న నేటి దినపత్రిక సూర్య యాజమాన్యానికి, ప్రజలకు, విలేకర్లకు ఇవే మా 19వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



ముల్లా ఖాదర్ హుస్సేన్
హెచ్‌డబ్ల్యూఓ,
ప్రభుత్వ ఎస్‌సి బాలుర వసతి గృహం, ఆళ్లగడ్డ.

నేటి దినపత్రిక సూర్యకు 19వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
నిర్భయంగా వార్తలు ప్రచురిస్తూ ప్రజల పక్షాన పోరాడుతున్న నేటి దినపత్రిక సూర్య యాజమాన్యానికి, ప్రజలకు, విలేకర్లకు ఇవే మా 19వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



ఎం సురేష్
హెచ్‌డబ్ల్యూఓ,
బీసీ కళాశాల బాలుర వసతి గృహం, ఆళ్లగడ్డ

నేటి దినపత్రిక సూర్యకు 19వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
నిర్భయంగా వార్తలు ప్రచురిస్తూ ప్రజల పక్షాన పోరాడుతున్న నేటి దినపత్రిక సూర్య యాజమాన్యానికి, ప్రజలకు, విలేకర్లకు ఇవే మా 19వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అనంతరామసుబ్బారెడ్డి
అనంత విద్యాసంస్థల అధినేత, ఆళ్లగడ్డ.